క్లుప్తంగా

పశు వైద్య శిబిరానికి విశేష స్పందన


కలియంబాకంలో పశు వైద్య శిబిరం

విజయపురం: మండలంలోని కలియంబాకంలో పశు వైద్య శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. పశు వైద్యాధికారి శివమూర్తి గర్భాశయ వ్యాధులు, ఇతర వ్యాధులకు చికిత్స అందించారు. ఆవులకు గర్భకోశ చికిత్స, చూలు పరీక్షలు నిర్వహించారు. పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఉచితంగా మందులు అందించారు.

నింద్రలో..


నేట్టేరి గ్రామంలో వైద్యాసేవలు చేస్తున్న పశు వైద్యాధికారులు

నింద్ర: పశు వైద్య శిబిరం ద్వారా ప్రతి గ్రామంలో పాడి రైతులు తమ పశువులకు వైద్య సేవలు పొందాలని అరూరు పశు వైద్య ఉప కేంద్రం వైద్యాధికారి ప్రభాకర్ వర్మ అన్నారు. మండలంలోని నెట్టేరి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరంలద్యాయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు వైద్య సేవలు అందించడంతో వివిధ రోగాలను నయం చేయవచ్చునని అన్నారు. అదేవిధంగా వివిధ రోగాలను అరికట్టేందుకు పాడి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈటీపీ ఉంటేనే డైయింగ్ యూనిట్లు


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

నగరి: ఈటీపీని సిద్ధం చేసుకున్నాకే డైయింగ్ యూనిట్లు ప్రారంభించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. డైయింగ్ సమస్యల పరిష్కారం నిమిత్తం మున్సిపల్ కార్యాలయంలో ఆయన డైయింగ్ యజమానులకు సమావేశం నిర్వహించారు. దీనికి 70 మందికి గాను 11 మంది మాత్రమే హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఈటీపీ ప్లాంటును పరిశీలించామని, ప్లాంటు రన్నింగ్‌లో లేదన్నారు. ప్లాంటుకు మరమ్మతులు చేపడితేనే పనిచేసే స్థితిలో ఉందన్నారు. యూనిట్ నిర్వాహకులు వెంటనే ప్లాంటు మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలన్నారు. అప్పటివరకు డైయింగ్ చేయరాదన్నారు. మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం పాల్గొన్నారు.

11 మంది జూదరుల అరెస్ట్

చిత్తూరు అర్బన్: నగరంలో పేకాడుతున్న 11 మందిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సీఐ నెట్టికంఠయ్య తెలిపారు. కూటమి నేతల కనుసన్నల్లో జరుగుతున్న పేకాట స్థావరాలపై సాక్షి దినపత్రికలో ఈ నెల 21న పేకాటే బరి కోట్లే గురి అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు సీరియస్ అయ్యారు. హైరోడ్డులో శుక్రవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు జరిపి 11 మందిని అరెస్ట్ చేశారు.

భవితతో భరోసా


విద్యార్థులకు ఇంటి వద్ద చదువులు చెపుతున్న ఉపాధ్యాయుడు

ప్రభుత్వ ఆధర్యంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాలు దివ్యాంగ విద్యార్థులకు వరంగా మారాయి. నిరుపేద దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్‌కు భరోసా కల్పించడంతోపాటు వారికి విద్య, వైద్యం, ఉచితంగా అందిస్తూ వారి ఉన్నతికి తోడ్పాటు అందిస్తున్నారు.

- దివ్యాంగ విద్యార్థులకు ఆసరాగా భవిత
- ఫిజియోథెరపీతోపాటు చదువులు
- వారంలో ఒక రోజు ఇంటి వద్దనే చదువులు


విద్యార్థులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

నింద్ర: మండల కేంద్రం నింద్రలో భవిత కేంద్రం ఎంతో మందికి పేద దివ్యాంగ విద్యార్థులకు ఆసరాగా నిలుస్తోంది. ఈ కేంద్రంలో విద్యార్థులకు ఫిజియోథెరపీ సేవలు అందించడంతోపాటు విద్య కూడా నేర్పిస్తున్యానరు. తద్వారా వారి ఉజ్వల భవిష్యత్‌కు గట్టి భరోసా కల్పిస్తున్నారు. ఈ కేంద్రంలో మొత్తం 120 మంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ చదువులు నేర్పడంతోపాటు ప్రతి మంగళవారం ఫిజియోథెరపీ నిర్వహిస్తున్నారు. వారికి అభ్యసనంలోని లోపాలు మార్చడం ద్వారా సాధారణ విద్యార్థులతోపాటు సొంతంగా చదువుకోగలరు. వారు ప్రాథమిక అంశాలను అనుసరించడంతో మానసిక ఉల్లాసం కలుగుతుంది. ఆటపాటలు, విద్యా విధానంపై దృష్టి సారించగలరు.

ఫిజియోథెరపీ సేవలు

మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో వారంలో ఒక రోజు దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు సహిత ఉపాధ్యాయుడు తెలిపారు. దీంతో అంగ వైకల్యం నుంచి కొంత వరకు మెరుగుపడే అవకాశం ఉంది. దీంతో వారు నడవడం, చదవడం, వారి పనులు వారే చేసుకోనేలా తీర్చిదిద్దుతున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా భవిత కేంద్రానికి వచ్చి తమ పిల్లలకు సేవలు చేయించుకుంటున్నారు. ప్రతి శనివారం గ్రామంలోని భవిత కేంద్రానికి చెందిన విద్యార్థులకు ఇంటి వద్దకే వెళ్లి చదువులు నేర్పిస్తున్నారు. ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్, దుస్తులు, ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. చెవుడు ఉన్న చిన్నారులకు హియరింగ్ ఎయిడ్స్, వీల్‌చైర్స్ తోపాటు సమగ్ర శిక్ష అభియాన్‌లో భాగంగా వారికి వివిధ సహాయకాలు అందిస్తున్నట్లు సహిత ఉపాధ్యాయుడు వెంకటేష్ అన్నారు.

ఎంతో ఉపయోగకరం



మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రం ఎంతో ఉపమోగకరంగా ఉంది. దివ్యాంగులైన విద్యార్థులకు ఎంతో సహాయంగా ఉంటూ వారికి చదువులతోపాటు వైద్యసేవలు ఎంతో మేలు కలిగింది.

–గీత, భవిత విద్యార్థిని తల్లి

ఆరోగ్యం మెరుగు పడింది



భవిత కేంద్రంలో సేవల ద్వారా మా బాబుకు ఆరోగ్యం ఎంతో మెరుగు పడింది. అంతేకాకుండా చదవడం, రాయడంతో పాటు తన పనులు తానే చేసుకుంటున్నాడు. భవిత కేంద్రం ఉపాధ్యాయుల సేవలు బాగున్నాయి.

–మోహన, విద్యార్థి తల్లి

సద్వినియోగం చేసుకోండి



మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రంలో అందించే, విద్యవైద్య సేవలను దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ దిశగా వారి తల్లిదండ్రులు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి వారం సాధారణ వైద్య సేవలతోపాటు ఫిజియోథెరపీ కూడా అందిస్తున్నాం.

–శ్రీధర్‌రాజు, మండల విద్యాశాఖాధికారి, నింద్ర మండలం

చిన్నారికి పరామర్శ

నగరి: మండలంలోని కావేటి పురం దళితవాడలో లైంగిక వేధింపులకు గురైన చిన్నారిని తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు శుక్రవారం పరామర్శించారు. పసిపాప ఆరోగ్యానికి సంబంధించిన వివరాలను ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు. మానవీయ కోణంలో చూడాల్సిన చిన్నారి విషయాన్ని రాజకీయం చేయడం సబబు కాదన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటామన్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న చెర్మన్ శివప్రకాష్‌రాజు

పాలసముద్రం: స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధికి సహకరించాలని పీహెచ్‌సీ చెర్మన్ శివ ప్రకాష్ రాజు తెలిపారు. శుక్రవారం పీహెచ్‌సీలో వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ సమక్షంలో పీహెచ్‌సీ కమిటీ సమావేశం జరిగింది. పీహెచ్‌సీ చెర్మన్ శివప్రకాష్ రాజు మాట్లాడుతూ..వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య పరీక్షలు చేయాలన్నారు. రోగులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కొత్త భవనం నిర్మించామన్నారు. పాత భవనాలను కూల్చి ప్రహరీ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవిందరాజ్, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్ వైజర్లు సుశీల, మురళి, వరదరాజు, లోకిదాస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ సీపీ నాయకులకు పరామర్శ


పరామర్శిస్తున్న మాజీ మంత్రి రోజా

నింద్ర: మండల కేంద్రమైన నింద్రకు చెందిన వైఎస్ ఆర్ సీపీ నాయకుడు సుబ్రమణ్యం యాదవ్‌ను శుక్రవారం మాజీ మంత్రి రోజా పరామర్శించారు. అతనికి గత వారం రోజుల క్రితం ఓపెన్ హార్ట్ సర్జరీ నిర్వహించారు. విశ్రాంతి తీసుకుంటున్న పార్టీ నాయకుడిని ఆమె పరామర్శించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, జెడ్పీటీసీ సభ్యులు పరంధామ, వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర యవజన కార్యదర్శి శ్యామ్‌లాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, సర్పంచ్ బాబురెడ్డి, మండల అధ్యక్షుడు వేణురాజు, మునికృష్ణరెడ్డి, సంపత్, సత్యరాజ్, దామోదరం తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు: కైలాసపురంలో వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు భాస్కర్ యాదవ్ సోదరుడు జానకిరామయాదవ్ ఇటీవల మరణించారు. దీంతో ఆమె భాస్కర్‌యాదవ్ కుటుంబాన్ని పరామర్శించారు.

సమస్యలు పరిష్కరించాలి

మండలంలో మూతపడిన షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు రావాల్సిన బకాయిలు, పీఎఫ్‌లు కార్మికులకు అందించాలని మాజీ మంత్రి రోజా అన్నారు. కార్మికులు ఆమెను కలిసి తమ సమస్యను తెలిపారు. కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వాలని సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

విజయపురం: మండలంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్‌ఆర్ సీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. విజయపురం దళితవాడకు చెందిన వైఎస్‌ఆర్ సీపీ కార్యకర్త నరసింహులు తల్లి చందా, లక్ష్మి భర్త తిరులోక చంద్రన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఆర్కే రోజా శుక్రవారం పరామర్శించి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆమె వెంట పార్టీ నాయకులు రాజాదాస్, శివరాజు, హరినాయుడు, కన్నన్, పాండియన్, సర్పంచ్ మురళీ, నార్పరాజు, తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేటలో నేడు సర్వసభ్య సమావేశం

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండల కేంద్రంలో శనివారం ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ శేషగిరిరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని తెలిపారు. అలాగే అందరు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఉత్తమ సేవకు అవార్డు


రవికుమార్

నగరి: 2024 సార్వత్రిక ఎన్నికల్లో 6, 7, 8 క్లెయింలు సక్రమంగా అందించి ఉత్తమ సేవలందించినందుకుగాను విజయవాడ వేదికగా ఈ నెల 25న బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీస్ అవార్డులను అందజేయనున్నారు. ఆ మేరకు చీఫ్ ఎలక్టరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. 15వ నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా ఈ అవార్డులను జారీ చేయనున్నారు. చిత్తూరు జిల్లా నగరి తహసీల్దార్ రవికుమార్‌కు ఆ అవార్డు దక్కింది. ఈ మేరకు ఆయన శనివారం విజయవాడలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు.

కుంభాభిషేకానికి సహకారం


పద్మనాభరెడ్డిని సన్మానిస్తున్న స్థానికులు

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ వేణుగోపాలపురంలో నూతనంగా నిర్మించిన తురకానమ్మ ఆలయ కుంభాభిషేకానికి శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కామసాని పద్మనాభరెడ్డి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం పద్మనాభరెడ్డి, మండల సర్పంచ్ సంఘం అధ్యక్షురాలు భారతిని సత్కరించారు. కార్యక్రమంలో రమణ, రాము, మణి, యువత ఉన్నారు.

నేడు ఓటర్ల దినోత్సవ ర్యాలీ

నగరి: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఉదయం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ భవానీ శంకరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీ అనంతరం పీసీఎన్ ఉన్నత పాఠశాలలో సమావేశం ఉంటుందని ఈ సమావేశంలో సీనియర్ సిటిజన్లు ఐదుగురిని సన్మానిస్తామన్నారు. పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతి అందజేస్తామన్నారు.

3 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలి


విజయపురం : ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

విజయపురం: కూటమి ప్రభుత్వం ఎన్నికలలో చెప్పిన విధంగా అర్హులైన పేద, బడుగు బలహీన వర్గ ప్రజలకు మూడు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని, అలాగే గత ప్రభుత్వం కేవీపురం దళితవాడకు ప్రజలకు ఇచ్చిన ఇంటి స్థలాన్ని చూపాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ధర్నా చేశారు. సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం కేవీపురం దళితవాడకు చెందిన సుమారు 70 మందికి ఇంటి పట్టాలు ఇచ్చిందని, అయితే ఆ స్థలం ఎక్కడ ఉందో నేటికీ రెవెన్యూ అధికారులు చూపించలేదన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన నగరి ఆర్డీఓ భవానిశంకరికి వినతిపత్రం అందించారు. దీనిపై ఆమె స్పందిస్తూ త్వరలో పరిష్కరించి న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రవి, ఏసుపాదం, జయలలిత, శారద, నందిని, సోకమ్మ, చిన్నమ్మ, మునివేలు, రాజేష్, హరీష్, మహిళలు పాల్గొన్నారు.

నెల్లేపల్లిలో చర్చి ప్రారంభోత్సవం


చర్చి ప్రారంభోత్సవంలో రెవరెండ్ హెన్రీ శర్మ నిత్యానందం, పాస్టర్లు

గంగాధర నెల్లూరు: మండలంలోని నెల్లేపల్లిలో కొత్తగా నిర్మించిన సీఎస్ఐ బేతేలు చర్చి ప్యారిషాల్, బెల్ టవర్‌ల ప్రారంభోత్సవానికి తమిళనాడు రాష్ట్రం వేలూరు అధ్యక్ష మండలం రెవండ్ హెన్రీ శర్మ నిత్యానందం ప్రారంభించారు. ఈ సందర్భంగా శర్మ నిత్యానందం మాట్లాడుతూ.. మానవాళికి రక్షణ దొరుకుతుందన్న నమ్మకంతో పాటు దేవుడికి పరిచర్య చేయడానికి నిర్మించిన స్థలమే దేవుడి ఆలయం అన్నారు. ఇక్కడ దేవునికి, మనిషికి ఒక బంధం ఏర్పడుతుందన్నారు. నెల్లేపల్లెలో క్రైస్తవులు ఆర్థిక సహకారంతో రూ.1.18 కోట్లతో కొత్త చర్చి నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవం చేసినందుకు బిషప్ వారిని అభినందించారు. కార్యక్రమంలో గంగాధర నెల్లూరు బోధకులు సురేష్, పరిచర్యకులు కరుణాకరన్, రఘుబాబు, కోశాధికారి జగన్ బాబు, మాజీ సర్పంచ్ పుష్పరాజ్, గురుమండల కార్యదర్శి కోటి, నెల్లేపల్లె దళిత వాడ పెద్దలు ప్రభు, దొరస్వామి, చెల్లా, వెంకటేష్, సీమ, మైకేల్, మేషక్, డేనియల్, యాకోబు, విజయకుమార్, పీటర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా చెట్లు నరికివేత


కార్యాలయం వద్ద నరికి పడేసి ఉన్న చెట్లు

నగరి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా, పాలక వర్గ సభ్యులకు ఎలాంటి సమాచారం అందించకుండా, అజెండాలో పొందుపరచకుండా ఎంపీడీఓ సతీష్ నరికివేయడంపై పాలక వర్గసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నీ ఆయన ఇష్టానుసారంగా చేసుకోవడానికి పాలకవర్గం ఎందుకని ఎంపీపీ భార్గవి ప్రశ్నించారు. తాము కార్యాలయం వద్ద లేని సమయంలో ఉన్న చెట్లన్నీ నరికి ట్రాక్టర్లలో వేసి పంపేశారన్నారు. ఆయనకు ఇంతటి అధికారం ఎవరిచ్చారన్నారు. దానికి సంబంధిత డబ్బులు కూడా జనరల్ ఫండ్‌లో చూపలేదన్నారు. వివరాలు అడిగినా ఆయన వద్ద నుంచి ఎలాంటి సమాధానం రావడం లేదన్నారు. ఏళ్ల తరబడి పెరిగిన చెట్లు కార్యాలయానికి విచ్చేసే వారికి ఎంతో నీడనిచ్చేదని ఆ పచ్చదనం పూర్తిగా కనుమరుగైందన్నారు. ఈ అంశంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలన్నారు.

బాలికలు విధిగా చదువుకోవాలి



పుత్తూరు: గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న సంతోషి, **వడమాలపేట:** బాలికలకు సూచినలిస్తున్న హెచ్‌ఎం


బాలికలకు సూచనలిస్తున్న డాక్టర్ విష్ణుప్రియ


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ వినితశ్రీ

పుత్తూరు: బాలికలు విధిగా చదువుకోవాలని, తద్వారా సమాజంలో తమదైన జీవన శైలిని ఏర్పరుచుకోవాలని పోషణ అభియాన్ టాటా ట్రస్ట్ కో–ఆర్డినేటర్ సంతోషీ తెలిపారు. శుక్రవారం గోపాలకృష్ణాపురం గురుకుల పాఠశాల, పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికలు చదువుపై శ్రద్ధ వహిస్తూ, జీవన శైలిపై అవగాహన ఎలా పెంచుకోవాలో తెలియజేశారు. విద్య, పౌష్టికారం, ఆరోగ్యం, మహిళా సాధికారత, లింగ సమానత్వ ఆవశ్యకతను వివరించారు. ప్రభుత్వం బాలికలకు కల్పిస్తున్న ప్రత్యేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి బాలిక 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేసుకోవాలని తెలిపారు. ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకోవడంపై బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఎస్వీకుమార్, శ్రీదేవి, వైస్ ప్రిన్సిపల్ చంద్రకళ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు గీతాంజలి, సంధ్య, ఎంఎస్ఎస్ తేజస్విని, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో స్త్రీ సాధికార సంస్థ కన్వీనర్ డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల వికాసానికి పలు పథకాలను అమలు చేస్తున్నాయని, వాటిని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు దేవకి, వాసవి, శ్రీనివాస్, లక్ష్మీబాయి విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష వద్దు

వడమాలపేట(విజయపురం): ఆడపిల్లలపై వివక్ష చూపొద్దని.. వారిని గౌరవించి చక్కగా చదివిద్దామని సీడీపీఓ రోజారమణి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం వడమాలపేట ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. బాల్య వివాహాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై హెచ్‌ఎం విమల సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు హిమశైల, గంగులమ్మ, కృష్ణవేణి, జయంతి, మహాలక్ష్మి, వరలక్ష్మి, నాగమణి, ఢిల్లీ, సుమతి, రేవతి, రేఖ, మంజుల పాల్గొన్నారు.

బాలికలను రక్షిద్దాం... చదివిద్దాం

విజయపురం: బాలికలను రక్షిద్దాం... చదివిద్దామని డాక్టర్ విష్ణుప్రియ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయపురం ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆడపిల్లలు బాగా చదువుకోవాలని, మంచి ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా, బలంగా ఆత్మస్థైర్యంతో ఉండాలని పేర్కొన్నారు. సమాజంలో ఆడపిల్లల పట్ల వివక్షకు స్వస్తి పలకాలన్నారు. బాలురకంటే బాలికలే నేటి సమాజంలో ముందున్నారని ఆమె గుర్తు చేశారు.

నగరిలో..

నగరి: ప్రభుత్వ డిగ్రీకళాశాలలో శుక్రవారం బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ వేణుగోపాల్ మాట్లాడుతూ బాలికలకు విద్య, ఉద్యోగ, వ్యాపార రంగంలో ఉజ్వలమైన భవిష్యత్తు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీఆర్సీ కోఆర్డినేటర్ అరుణకుమార్, జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ పంకజ, ఆంగ్ల విభాగాధిపతి రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఆడ పిల్లలపై వివక్ష ఉండకూడదు

నగరి: ఆడపిల్లలపై వివక్షతకు తావు ఉండకూడని సీడీపీఓ కృష్ణవేణి అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని పుదుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలపై భేదభావాన్ని ప్రదర్శించడం సరికాదని, వారికి బాలురతో సమానంగా ఎదిగే అవకాశాలు లభించేలా చూడాలన్నారు. ఆకాశంలో సగం తామంటూ.. అన్ని రంగాల్లో సత్తా చాటుతున్న ఆడవారికి ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా సహకారం అందిస్తోందన్నారు. బాలికలు అన్ని రంగాల్లో ముందుకెళ్లాలని, తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని, ఉన్నతమైన చదువులు చదివి, గొప్ప పదవులు అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శంకరమ్మ, ఆషాలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి

పాలసముద్రం: బాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని గంగాధర నెల్లూరు ప్రాజెక్టు సీడీపీఓ వినితశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం పాలసముద్రం ఉన్నత పాఠశాల ఆవరణలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అనురాధ, సంగీత, హెచ్‌ఎం మీనాక్షి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా సదస్సు నిర్వహించారు. తల్లిదండ్రులు అబ్బాయి, అమ్మాయి అనే వివక్ష లేకుండా సమానంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్ వైజర్ సుశీల, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో ఎదగాలి

నింద్ర: బాలికలు అన్ని రంగాల్లో ఎదగాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్యామల అన్నారు. బాలికలు దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని కొత్త అరూరు జిల్లా ఉన్నత పాఠశాలలో బాలికల దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు చదువుతోపాటు క్రీడలు, పోటీ పరీక్షలలో ప్రతిభ కనబరచాలని అన్నారు. అనంతరం పౌష్టికాహారం తీసుకోవడంతో బాలికల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం

వెదురుకుప్పం: బాలికల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద పేర్కొన్నారు. జాతీయ బాలికా దినో త్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో బాలికలకు ప్రత్యేక హక్కులను కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఉన్నత విద్యతోనే బాలికల బంగారు భవిష్యత్తు ఆధారపడుతుందన్నారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ లత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారిణి మంగళగౌరి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వెంకటేశ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఇబ్బంది పడకుండా రీసర్వే


మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణకుమారి

పాలసముద్రం: మండల పరిధిలో జరుగుతున్న రీ సర్వేను రైతులు ఇబ్బందులు పడకుండా చేయాలని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. శుక్రవారం రెవెన్యూ కార్యాలయంలో విలేజ్ సర్వేయర్, వీఆర్‌ఓలకు సమావేశం నిర్వహించారు. భూసమస్యల పరిష్కారానికి చేపడుతు న్న రీ సర్వేను తప్పకుండా రైతులు భూముల వద్దకు వెళ్లి రికార్డులు పరిశీలించిన తరువాతనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ దేవి, మండల సర్వేయర్ గణేష్, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.